క్లుప్తంగా

గన్నవరంలో నియోజకవర్గ పాస్టర్ల సమావేశం



గన్నవరం: స్థానిక ఏబీ కన్వెన్షన్ హాలులో బుధవారం వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో సేవకుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అంతర్జాతీయ సువార్తికురాలు వైఎస్.విమలారెడ్డి పాస్టర్లను ఉద్దేశించి ప్రసంగించారు. క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేడిది జాన్సన్, రాష్ట్ర కార్యదర్శి భక్తపాల్, రాష్ట్ర సమన్వయ సభ్యులు ప్రతాప్ సింహ్, జిల్లా అధ్యక్షుడు పోలిమెట్ల జయరాజు, జిల్లా కార్యదర్శి బొకినాల శామ్యుల్, భరత్, గన్నవరం నియోజకవర్గానికి చెందిన పాస్టర్లు పాల్గొన్నారు.

నేడు షిర్డీ సాయిబాబా మందిర వార్షికోత్సవం

కంకిపాడు: మండలంలోని చలివేంద్రపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ షిర్డీ సాయిబాబా మందిరం 18వ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నట్లు శ్రీ సాయిరామ్ తీర్థ సేవా ట్రస్ట్ తెలిపింది. బుధవారం వివరాలు తెలుపుతూ... గురువారం తెల్లవారు జామున 5 గంటల నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. పండ్ల రసాలతో అభిషేకం, అష్టోత్తర సహస్రనామార్చన, భగవద్గీత పారాయణం నిర్వహిస్తామన్నారు. భక్తులకు అన్న సమారాధన, భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. వార్షికోత్సవంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



గన్నవరంరూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి చెప్పారు. మండలంలోని ముస్తాబాద నవభారత్ హైస్కూల్‌లో క్రాప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన బాలల మేళా కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మానసిక ఉల్లాసానికి, శారీరక ధారుడ్యానికి క్రీడలు ఉపయోగపడతాయన్నారు. ప్రిన్సిపాల్ షేక్ ఇమాం అధ్యక్షతన విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. క్రాప్ కో ఆర్డినేటర్ సీహెచ్ ప్రభాకర్, కరస్పాండెంట్ షేక్ జాకీరా సుల్తానా, వెల్ఫేర్ అసిస్టెంట్ నానా రావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల సేవలు



పెనమలూరు: వణుకూరు గ్రామంలో గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో ఈ నెల 1 నుంచి 7వ తేదీ వరకు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. సామాజిక, పర్యావరణ సమస్యలు పరిష్కారం చేశారు. స్వచ్ఛభారత్, ప్లాస్టిక్ నివారణకు అవగాహన సదస్సులు, ఉచిత వైద్యశిబిరం, హైస్కూల్ విద్యార్థులకు ఉన్నత విద్య పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చక్క విజయ సహకారంతో గ్రామంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామని బుధవారంతో శిబిరం ముగిసిందని కాలేజీ ప్రిన్సిపాల్ కడియాల రవి తెలిపారు.

ఉపాధ్యాయులు ఐక్యతతో మెలగాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ఉపాధ్యాయులు ఐక్యతతో మెలిగినప్పుడే సమస్యల పరిష్కారం సాధ్యమని యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.భగీరథి అన్నారు. బాపులపాడు మండలం వీరవల్లిలోని జెడ్పీ హైస్కూల్‌లో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) మండల కార్యవర్గ సమావేశం బుధవారం జరిగింది. సమావేశంలో ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెలమర్తి రవిబాబు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు మానికొండ రమణగోపాల్, మండల అధ్యక్షురాలు పి.జగతి, సహ అధ్యక్షుడు బి.నాగరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీహరి, కోశాధికారి పి.రాజేష్ పాల్గొన్నారు.

నులి పురుగుల నిర్మూలనను విజయవంతం చేయాలి

ఉయ్యూరు: నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీని విజయవంతం చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ గీతాబాయి ఆదేశించారు. మండలంలోని కాటూరు పీహెచ్‌సీని బుధవారం ఆమె సందర్శించారు. ఆరోగ్య కేంద్రం పనితీరు పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. నులి పురుగుల నివారణ మాత్రలను పాఠశాల ఉపాధ్యాయులకు అప్పగించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ గీతాబాయి మాట్లాడుతూ.. ఈనెల 9న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులందరికీ నులి పురుగుల నివారణ మాత్రలు అందిస్తున్నామన్నారు. నులి పురుగులను నులిమేసి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దామన్నారు. ప్రతి ఉద్యోగి తమకు కేటాయించిన హెడ్ క్వార్టర్‌లోనే ముఖాధారిత అటెండెన్స్ కచ్చితంగా వేయాలని చెప్పారు. పీహెచ్‌సీలో నెలకు 5 డెలివరీలు తప్పనిసరిగా జరగాలన్నారు. ఆర్‌సీహెచ్ పోర్టులో గర్భిణులు, చిన్నారుల నమోదు నూరుశాతం జరగాలన్నారు. పీహెచ్‌సీలకు వచ్చే రోగుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అందరికీ ఉచితంగా మందులు అందించి ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు ఎస్.శివరామకృష్ణ, హిమామహేశ్వరి, ఆరోగ్య విస్తరణాధికారి నాగార్జునబాబు, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాత్రల పంపిణీ..

విజయవాడరూరల్: ఈ నెల 9వ తేదీ జరిగే జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు సమన్వయంతో విజయవంతం చేయాలని ఎన్టీఆర్ జిల్లా డెప్యూటీ డీఎంహెచ్‌ఓ ఇందుమతి ఆదేశించారు. విజయవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో నులిపురుగుల నిర్మూలన అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డెప్యూటీ డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. విజయవాడ రూరల్ మండలంలో 1 సంవత్సరం నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు, ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయాలన్నారు. అదే విధంగా ప్రతి ఎలిమెంటరీ స్కూల్ నుంచి కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులకు మాత్రలు అందజేయాలన్నారు. నులి పురుగులను నివారించడం వలన ఆహారం మంచిగా అరుగుదల జరిగి హిమోగ్లోబిన్ పెంపుదలతో పాటు, జ్ఞాపకశక్తి పెరుగుతుందని చెప్పారు.

52 వేల మందికి మాత్రలు

ఎంపీడీఓ శ్రీరమ్య మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులి పురుగులను నిర్మూలించాలన్నారు. వెలగలేరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం మెడికల్ ఆఫీసర్ మాధురి మాట్లాడుతూ ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు పిల్లలందరికీ నులి పురుగుల మాత్రలను అందజేయాలన్నారు. విజయవాడ రూరల్ మండలంలో 52 వేల మంది విద్యార్థులున్నారని ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు నులి పురుగుల మాత్రలను వేయాలని మండల విద్యాశాఖాధికారి ఎ.సూరిబాబు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కాటూరు పీహెచ్‌సీలో వైద్యులకు సూచనలు ఇస్తున్న డీఎంహెచ్‌ఓ గీతాబాయి



విజయవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో మాత్రలు అందజేస్తున్న డెప్యూటీ డీఎంహెచ్‌ఓ ఇందుమతి, మెడికల్ ఆఫీసర్ మాధురి

ఆల్బెండజోల్‌తో నులి పురుగుల నిర్మూలన

ఉంగుటూరు: ఈ నెల 9వ తేదీన జరిగే జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల పరిషత్ సూపరింటెండెంట్ బసవయ్య పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద జాతీయ నులిపురుగుల నిర్మూలన వాల్‌పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఒకటి నుంచి 19 ఏళ్లలోపు వయసు ఉన్న పిల్లలందరికీ నులి పురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలు, మందును వేయాలని డాక్టర్లు సూచించారు. ఆల్బెండజోల్ మాత్రలను ఎంఈఓ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో ఇందుపల్లి, ఉంగుటూరు, పెదఅవుటపల్లి, ఆత్కూరు పీహెచ్‌సీల డాక్టర్లు బి.శిరీష, ప్రసన్న రాణి, కరిముల్లా, మనోహర్‌రెడ్డి, ఎంఈఓ సాంబశివరావు పాల్గొన్నారు.

హెచ్‌ఎంలకు మాత్రల అందజేత

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ఆరోగ్యకరమైన పిల్లల కోసం ఏటా తప్పనిసరిగా నులిపురుగుల మాత్రలను వేయాలని బాపులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎంజే మంజూష చెప్పారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఈ నెల 9వ తేదీన అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో పిల్లలకు ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయాలన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ఆల్బెండజోల్ మాత్రలను పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు బుధవారం పంపిణీ చేశారు. పిల్లల కడుపులో నులిపురుగులు ఉన్నట్లయితే రక్తహీనత, పోషకాహార లోపం, నీరసంగా ఉంటారని డాక్టర్ మంజూష పేర్కొన్నారు. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలలో లోపాలు తలెత్తుతాయని చెప్పారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజా ప్రతినిధులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను కోరారు. ఎంపీపీ యర్రగొర్ల నగేష్, ఎంపీడీఓ రత్నకుమారి, ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంఈఓ శ్రీరామ్ బాలాసింగ్ పాల్గొన్నారు.



జంక్షన్‌లో హెచ్‌ఎంలకు మాత్రలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు



ఉంగుటూరులో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు



కంకిపాడులో మాత్రలు అందజేస్తున్న ఎంపీడీఓ అనూష

పిల్లల ఆరోగ్య పరిరక్షణ

కంకిపాడు: నులి పురుగుల నివారణతో పిల్లల ఆరోగ్య పరిరక్షణ సాధ్యమవుతుందని ఎంపీడీఓ పి.అనూష అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నులి పురుగుల నివారణ కార్యక్రమంపై బుధవారం సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులకు ఆల్బెండజోల్ మాత్రలను అందించారు. వ్యక్తిగత పరిశుభ్రత, రక్తహీనత నివారణపై ఆమె అవగాహన కల్పించారు. ఉప్పలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుధా ప్రసూజ ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఎంఈఓ ప్రసాద్, ఎంపీహెచ్‌ఈఓ కృష్ణారావు, వైద్య సిబ్బంది, టీచర్లు పాల్గొన్నారు.

నేడు ఉప్పలూరులో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

కంకిపాడు: మండలంలోని ఉప్పలూరు గ్రామంలో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.అనూష తెలిపారు. బుధవారం ఆమె వివరాలు తెలుపుతూ.. గ్రామంలోని సెయింట్ ఆన్స్ పాఠశాల మైదానంలో ఆసరా చెక్కుల పంపిణీ సభ గురువారం సాయంత్రం 4 గంటలకు జరుగుతుందన్నారు. ఉప్పలూరు, వేల్పూరు, మంతెన, తెన్నేరు, మారేడుమాక గ్రామాలకు చెందిన డ్వాక్రా మహిళలు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి జోగి రమేష్ పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీడీఓ కోరారు.

జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ వేగవంతం



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వం పేదలకు ఇచ్చిన జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేశామని మున్సిపాలిటీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు చెప్పారు. యనమలకుదురు సచివాలయం – 1ని కమిషనర్ బుధవారం సందర్శించి ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఏపీ గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఆదేశాల మేరకు మున్సిపాలిటీ పరిధిలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ వేగవంతం చేశామన్నారు. సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు సమన్వయంతో పని చేసి లబ్ధిదారులకు మేలు చేయాలని సూచించారు. లబ్ధిదారులకు సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. రిజిస్ట్రేషన్లను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య శ్రీ కార్డులను వెంటనే అందజేయాలి

విజయవాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఆరోగ్య శ్రీ కార్డులను అర్హులైన వారందరికీ వెంటనే అందజేయాలని ఎంపీడీఓ ఎ.శ్రీరమ్య ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన వైద్య సిబ్బంది సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. విజయవాడ రూరల్ మండలంలో 35,115 ఆరోగ్య శ్రీ కార్డులను ప్రభుత్వం మంజూరు చేయగా ఇప్పటి వరకు 10,317 కార్డులు మాత్రమే అందజేశారన్నారు. మిగిలిన కార్డులను కూడా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అందజేసి, ఆరోగ్య శ్రీ కార్డుల ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య శ్రీ కార్డు కలిగిన కుటుంబానికి కార్పొరేట్ ఆస్పత్రుల్లో 25 లక్షల రూపాయల వరకు ఉచితంగా వైద్య సేవలను అందిస్తుందనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. అందుబాటులో ఉన్న వైద్యశాలల వివరాలను యాప్ ద్వారా తెలుసుకొనే అవకాశం ఉందని ఆ వివరాలను కూడా ప్రజలకు వివరించాలని చెప్పారు. గ్రామాల్లోని ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లతో కలిసి ప్రజల ఇళ్లకు వెళ్లి ఆరోగ్య శ్రీకార్డులను అందజేయాలని వెలగలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాధురి పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీరమ్య

ఏఎంసీ ద్వారా రూ.2.99 కోట్ల పనులకు ఆమోదం




పాలకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న తోట కరుణ

గన్నవరం: నియోజకవర్గంలో రైతుబజార్ల అభివృద్ధికి, విస్తరణకు, గిడ్డంగుల మరమ్మతులకు రూ.2.99 కోట్లు మంజూరు చేసినట్లు గన్నవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ తోట కరుణ తెలిపారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం ఆమె అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులు, మరమ్మతులకు నిధులు కేటాయిస్తూ తీర్మానాలు చేశారు. మార్కెట్ ఫీజు కింద 2022–23లో రూ.2.47 కోట్లు, 2023–24లో రూ.3.67 కోట్లు వసూలు చేశామని, ప్రస్తుత ట్రెజరీ నిల్వ రూ.14.24 కోట్లు ఉన్నట్లు గ్రేడ్–1 కార్యదర్శి ఏ.కిషోర్ వివరించారు.

త్వరితగతిన పనుల పూర్తి..

తోట కరుణ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే వంశీమోహన్ సూచనల మేరకు ప్రజలకు సరసమైన ధరలకు కూరగాయలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు, రైతులకు మేలు చేసేందుకు నూతన రైతుబజార్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. అందులో భాగంగా రామవరప్పాడు రైతుబజార్ నిర్మాణానికి రూ.1.05 కోట్లు, తేలప్రోలు రైతుబజార్‌కు రూ.72 లక్షలు, నున్న రైతుబజార్‌కు రూ.50 లక్షలు కేటాయించామని తెలిపారు. గన్నవరం రైతుబజార్ పార్కింగ్ స్థలం లెవలింగ్‌కు, అదనపు దుకాణాల నిర్మాణానికి రూ.20.30 లక్షలు మంజూరు చేశామన్నారు. గన్నవరం వ్యవసాయ మార్కెట్ యార్డులో గోదాముల మరమ్మతులకు రూ.35 లక్షలు, బాపులపాడు సబ్ యార్డులోని గోదాముల మరమ్మతులకు మరో రూ. 17 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. ఈ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు, రైతులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పంట పొలాలకు వెళ్లే డొంక రోడ్లను అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, ఏఎంసీ గ్రేడ్–3 కార్యదర్శి పి.జ్యోతి, వ్యవసాయ శాఖ ఏడీ సునీల్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం



మాట్లాడుతున్న అక్కినేని వనజ

పెనమలూరు: ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమ నాయకురాలు జాస్తి సక్కుబాయి రాజీలేని పోరాటం చేశారని సీపీఐ జాతీయ సమితి కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. పోరంకిలో బుధవారం ఇటీవల మరణించిన మహిళా ఉద్యమ నాయకురాలు సక్కుబాయి సంస్మరణ సభలో ఆమె పాల్గొని ప్రసంగించారు. జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమ వ్యాప్తికి నేతలు జీవీఆర్ చౌదరి, చలసాని వెంకటరత్నం, వజ్జే సుబ్బారావు, కోనేరు చెన్నకేశవరావు అహర్నిశలు కృషి చేశారన్నారు. సీపీఐ నేతలు దోనేపూడి శంకర్, దుర్గాభవాని, టి.తాతయ్య, మన్నవ కృష్ణచైతన్య, అరుణ్‌కుమార్, తోటకూర రమకృష్ణ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

గన్నవరంరూరల్: మండలంలోని తెంపల్లి గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను బుధవారం తహసీల్దార్ పవన్‌కుమార్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల నంబర్లు, వసతులు పరిశీలించి సిబ్బందికి తగు ఆదేశాలిచ్చారు. సచివాలయం కార్యదర్శి హర్షవర్ధిని పాల్గొన్నారు.

ప్రతిభా పోటీల్లో హెచ్‌ఎంకే విద్యార్థిని సత్తా



ప్రతిభా పురస్కారం అందుకుంటున్న విద్యార్థిని తేజశ్రీ

కంకిపాడు: శ్రీ కృష్ణవేణి ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ నిర్వహించిన ప్రతిభా పోటీల్లో గోసాల హెచ్‌ఎంకే హైస్కూల్ పదో తరగతి విద్యార్థిని ప్రతిభ చాటింది. పాఠశాల డైరెక్టర్ ఆర్.వసంత్‌కుమార్, ప్రిన్సిపాల్ సుక్‌మిత్‌కౌర్ ప్రతిభ చాటిన విద్యార్థిని బుధవారం అభినందించారు. వారు మాట్లాడుతూ ఈనెల 4న పదో తరగతి విభాగంలో శ్రీ కృష్ణవేణి ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రతిభా పోటీలు నిర్వహించిందన్నారు. 265 పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులు పోటీ పడగా హెచ్‌ఎంకే పాఠశాలలో పదో తరగతి చదువుతున్న తేజశ్రీకి ప్రథమ స్థానం లభించిందన్నారు. ప్రశంసాపత్రం, రూ.10 వేలు నగదు బహుమతి లభించాయని చెప్పారు. విద్యార్థిని ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

పెదపులిపాకలో విద్యార్థిని అదృశ్యం

పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో విద్యార్థిని అదృశ్యమవ్వటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం షేక్ ఆషా గ్రామంలో మసీదు సమీపంలో నివశిస్తుంది. ఆమె కూలి పనులు చేస్తుంది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు. ఆషా చిన్న కుమార్తె (15) పదో తరగతి తాడిగడప పాఠశాలలో చదువుతుంది. ఈ నెల 5వ తేదీన ఆమె పాఠశాలకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుమార్తె కోసం తల్లి, కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికారు. కుమార్తె జాడ తెలియక పోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

నలుగురు జూదరుల అరెస్ట్

పెనమలూరు: కోత ముక్క ఆడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పెనమలూరు ఎస్ఐ శేషకుమార్ తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు పల్లిపేటలో రౌండ్స్‌లో ఉండగా గ్రామ శివారు అరటితోటలో కోత ముక్క ఆడుతున్నారన్న సమాచారంతో దాడి చేశామన్నారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ 40.700 సొమ్ము స్వాధీనం చేసుకున్నామన్నారు. నలుగురిపై కేసు నమోదు చేశామని చెప్పారు.

ఉపాధి హామీ పనుల్లో అవకతవకలను సహించం

డ్వామా పీడీ సూర్యనారాయణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించే ప్రధాన ఉద్దేశంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని జిల్లా నీటి యాజమాన్య ఏజెన్సీ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ జీవీ సూర్యనారాయణ చెప్పారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి గానూ బాపులపాడు మండలంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్వహించిన పనులపై బుధవారం ప్రజా వేదిక నిర్వహించారు. గ్రామాల వారీగా నిర్వహించిన సామాజిక తనిఖీ నివేదికలపై స్థానిక మహాత్మాగాంధీ నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజా వేదికకు డ్వామా పీడీ సూర్యనారాయణ హాజరయ్యారు. మండలంలోని 27 గ్రామాల్లో ఉపాధి కూలీల మస్టర్ నమోదులో పలు అవకతవకలను సామాజిక తనిఖీలో గుర్తించటంతో క్షేత్రస్థాయి సిబ్బందిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కూలీల మస్టర్ల పట్ల నిర్లక్ష్యం వహించిన ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.50 వేలు జరిమానా విధించారు. ఏపీఓ అశోక్ మాట్లాడుతూ.. 2022–23 ఆర్థిక సంవత్సరంలో మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 1,447 పనులు నిర్వహించగా, రూ.9 కోట్ల కూలీల వేతనాలు, రూ.4.58 కోట్లు మెటీరియల్స్ రూపేట వెచ్చించామన్నారు. ఎంపీడీఓ రత్నకుమారి, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు చర్యలు



పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

పెనమలూరు: మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు రైతులు చర్యలు చేపట్టాలని ఉయ్యూరు రీసెర్చ్ స్టేషన్ శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి అన్నారు. తాడిగడపలో రైతులు సాగుచేస్తున్న మొక్కజొన్న పంటను ఆమెతో పాటు జిల్లా రీసెర్చ్ సెంటర్ అధికారులు కె.శ్రీనివాసరావు, పద్మజ, మండల వ్యవసాయాధికారిని కనకమేడల శైలజ పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. మండలంలో దాదాపు 350 ఎకరాల్లో మొక్క జొన్నపంట సాగు జరుగుతుందన్నారు. పంటలో కత్తెర పురుగును గుర్తించామన్నారు. దాని నివారణకు వేప నూనె 5 ఎంఎల్ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. బెంజోయేట్ మందు పిచికారీ చేయాలన్నారు. వరి పంటలో కాండం తొలుచు పురుగు, అగ్గి తెగులు నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటర్‌నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వరిలో 20 కేజీలు పొటాష్ రెండు దఫాలుగా వేయాలని సూచించారు.